క్లుప్తంగా

ప్రధాన రహదారి అభివృద్ధి



ముక్కామలలో నిర్మిస్తున్న మెటల్ రోడ్డు

సాక్షి ఇంపాక్ట్

అంబాజీపేట: ముక్కామల–వక్కలంకకు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదభరితంగా ఉన్న సీసీ రోడ్డును అధికారులు అభివృద్ధి చేశారు. గతేడాది నవంబర్ 25న 'సాక్షి'లో 'ఆదమరిస్తే.. ప్రమాదమే' శీర్షికన కథనం వెలువడింది. దాంతో సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ప్రమాదభరితంగా ఉన్న ఈ రహదారికి మరమ్మతులు చేశారు. సీసీ రోడ్డు విడిపోయి, పాడైనంత వరకు మెటల్ రోడ్డు వేశారు.

చిన్నారులకు ఆధార్ నమోదు చేయించాలి



మాచవరంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ఐదేళ్లలోపు వయస్సున్న చిన్నారులకు ఆధార్ నమోదును తప్పనిసరిగా చేయించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం సచివాలయం-2 వద్ద చిన్నారులకు ఆధార్ నమోదు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరి అయిన నేపథ్యంలో, చిన్నారుల తల్లిదండ్రులు అలసత్వం వహించకుండా నమోదు చేయించాలన్నారు. మండలంలో తేదీల వారీగా ఏర్పాటు చేసిన ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, మైలా ఆనందరావు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల సుబ్బారావు, కొల్లూరి దివాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అయినవిల్లి: నేదునూరు జెడ్పీ హైస్కూల్‌లో అమలాపురం కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు ఉచిత దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. రావి ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటైన ఈ శిబిరాన్ని సర్పంచ్ గుమ్మడి ప్రసాద్ ప్రారంభించారు. కిమ్స్ ఆస్పత్రికి చెందిన 20 మంది వైద్యుల బృందం వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఉచిత పశు వైద్య శిబిరం

రావులపాలెం: మండలంలోని పొడగట్లపల్లి గ్రామంలో ఉన్న పశు వైద్యశాల వద్ద గురువారం ఉచిత మెగా పశువైద్య శిబిరం నిర్వహించారు. రావులపాలెం ఏరియా పశువైద్య సహాయ సంచాలకుడు డా.ఉమామహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ గంధం దేవి అధ్యక్షతన కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సుమారు 128 పశువులను పరీక్షించి, వివిధ వ్యాధులకు ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్, కాల్షియమ్ టానిక్స్ పంపిణీ చేశారు. అదే పంచాయతీలోని సాగివారివీధి, జనిపిరెడ్డిపాలెం, వినాయకపాలెం, సోమాలమ్మగుడి ఏరియాలలో పలువురు రైతులకు మంజూరైన గోకులం షెడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. డీఏహెచ్ఓ కె.వెంకట్రావు, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సఖిలే నాగజ్యోతి, కలిగినీడి సత్యవతి, వైద్యాధికారులు ఎం.సోమేశ్వరరెడ్డి, మోటూరి రామారావు పాల్గొన్నారు.

నాగుల్లంకలో..

పి.గన్నవరం: పాడి రైతులకు అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ ప్రత్యేకాధికారి డాక్టర్ కె.రాధాకృష్ణ అన్నారు. నాగుల్లంక గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అమలాపురం ఏహెచ్ డీడీ కర్నీడి మూర్తి అధ్యక్షత వహించారు. మొత్తం 70 పశువులకు పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లేగ దూడలకు అందాల పోటీలు నిర్వహించారు. 40 లేగదూడలు పాల్గొనగా, తొలి మూడు స్థానాలకు బహుమతులు అందజేశారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, పశు సంవర్ధక శాఖ ఏడీ ఎల్.విజయారెడ్డి పాల్గొన్నారు.

పొదలాడలో..

రాజోలు: పాడి పశువులు అనారోగ్యానికి గురికాకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ రవికుమార్ అన్నారు. గురువారం పొదలాడలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ కడలి సత్యనారాయణ ప్రారంభించారు. నట్టల నివారణ మందుల పంపిణీ, గర్భకోశ వ్యాధులకు చికిత్స, నిర్ధారణ పరీక్షలు చేసి, మినరల్ మిక్చర్ ప్యాకెట్లను అందజేశారు. పశు వైద్యాధికారి సీహెచ్ లక్ష్మీబాయి, ఎంపీటీసీ శిరిగినీడి వెంకటేశ్వరరావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

స్పందనకు మంగళమేనా..!

- పరిష్కారానికి నోచుకోని గ్రామ స్థాయి సమస్యలు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో ప్రతి రోజూ స్పందన
- ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోని వైనం



గంగలకుర్రులో గ్రామ సచివాలయం

అంబాజీపేట: సచివాలయాల పరిధిలో పరిపాలనా సౌలభ్యంలో భాగంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతిరోజూ స్పందన కార్యక్రమానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాల్లో ఎక్కడా దాని ఆనవాళ్లు కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలంటూ, ప్రతిరోజూ స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఎవరిపైనైనా ఫిర్యాదు చేసేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతిరోజూ సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు పంచాయతీ కార్యదర్శితో పాటు, సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందనకు హాజరయ్యేవారు.

గ్రామంలో ఏ విధమైన సమస్య ఉన్నా స్థానికంగా ప్రతిరోజూ గంట పాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేసి, సమస్యలను వెంటనే పరిష్కరించుకునేవారు. దీనివల్ల గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరాభారం, ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథా కాకుండా ఇంటికి సమీపంలోనే స్పందన జరగడంతో ప్రజలకు మరింత అనుకూలంగా ఉండేది. జీవనోపాధి కోసం వివిధ పనులకు వెళ్లే గ్రామీణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది.

కూటమి ప్రభుత్వం ప్రజలకు మళ్లీ కష్టాలు తీసుకువచ్చింది. గ్రామస్థాయిలో ప్రతిరోజూ గంట పాటు జరిగే స్పందన కార్యక్రమంపై చిన్నచూపు చూడటంతో, ప్రజలు మండల స్థాయి స్పందనకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలోనే స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే, వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు పడాల్సి వస్తోంది. కొత్తపేట నియోజకవర్గంలో 87, రాజోలు నియోజకవర్గంలో 74, పి.గన్నవరం నియోజకవర్గంలో 76 సచివాలయాలను ఏర్పాటు చేసి, గత ప్రభుత్వం ప్రజలకు ఉత్తమ సేవలు అందించింది. ఆయా సచివాలయాల్లో సుమారు 2,300 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు.

పేరుకుపోతున్న సమస్యలు

ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు మండల కేంద్రానికి రావాల్సి ఉండటంతో, చాలా మంది ప్రజలు, బాధితులు ఇబ్బందులు పడి, సమస్యలను చెప్పలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మండల హెడ్ క్వార్టర్‌లోనే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గ్రామ స్థాయి స్పందన కొనసాగించాలి



ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని వెంటనే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఓ మంచి కార్యక్రమాన్ని నీరుగార్చకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకుని, గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి.
– కాండ్రేగుల సింహాచల వరప్రసాద్, పుల్లేటికుర్రు

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండల కేంద్రంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. వారి కష్టాలు చెప్పుకొనేందుకు గత ప్రభుత్వం అద్భుతంగా గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తి స్థాయిలో కొనసాగించాలి.
– కుసుమ శ్రీనివాస్, మాచవరం

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మామిడికుదురు: నగరం, మగటపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ అమలాపురం ఈఈ ఎం.రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ట్రీ కటింగ్, లైన్ మెయింటెనెన్స్ కోసం విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్లు చెప్పారు.

పి.గన్నవరం: మూడు రోడ్ల సెటర్ నుంచి పోతవరం వరకు సీసీ రోడ్డు నిర్మిస్తున్నందున విద్యుత్ స్తంభాలను మార్చనున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 వరకు విద్యుత్ ఉండదు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాతకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన దవులూరి సాయి రామకృష్ణ ఆయన కుటుంబ సభ్యులు గురువారం రూ.10,116లు సమర్పించినారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు వినాయకరావుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ బోస్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



నగరం పాఠశాలలో జరిగిన నేతాజీ జయంతిలో పాల్గొన్న విద్యార్థులు



జి.అగ్రహారంలో బోస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



వాడపాలెంలో పారిశుధ్య కార్మికులను సత్కరిస్తున్న ధర్మసూత్రం ప్రతినిధులు, నాయకులు

అంబాజీపేట: స్వాతంత్ర్య సమరయోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ధైర్యసాహసాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హెచ్ఎం జీఎస్‌హెచ్ రాజశేఖర్ అన్నారు. గంగలకుర్రు అగ్రహారం జెడ్పీ హైస్కూల్‌లో బోస్ జయంతిని గురువారం నిర్వహించారు. అంతకుముందు బోస్ చిత్రపటానికి పలువురు ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

యువత స్ఫూర్తిగా తీసుకోవాలి

కొత్తపేట: వాడపాలెం గ్రామంలో నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ధర్మసూత్రం సంస్థ ప్రతినిధులు, సినీ నటుడు బోడిశెట్టి పవన్‌సురేష్, జెడ్పీ ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ సింగిరెడ్డి గోవిందుస్వామి ఆధ్వర్యంలో నేతాజీ సెంటర్‌లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బోస్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆర్ఎస్ఎస్ నాయకుడు ఓలేటి సత్యనారాయణ మాట్లాడుతూ, బోస్‌ను యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌కు జిల్లా నుంచి ఎంపికైన సర్పంచ్ త్సామా బాబును సత్కరించారు. అలాగే వివిధ రికార్డులు సాధించిన పురోహితుడు పెద్దింటి రామచంద్రశ్రీహరి(రామం)ను, గ్రామ పారిశుద్ధ్య కార్మికులను సన్మానించారు. మాజీ సర్పంచ్ బండారు బులితాత, వైఎస్సార్ సీపీ నాయకుడు పెదపూడి బాపిరాజు, పంచాయతీ కార్యదర్శి మంగిపూడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు: నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతి సందర్భంగా నగరం ప్రాథమిక పాఠశాలలో ఆయన చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఉపాధ్యాయుడు మాగాపు విజయదుర్గారావు ఆధ్వర్యంలో విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం నిర్భయంగా నేతాజీ పోరాడారని కీర్తించారు. మామిడికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నేతాజీ చిత్రపటాన్ని అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నక్కా పట్టాభి పాల్గొన్నారు.

ఘనంగా బోస్ జయంతి

అయినవిల్లి: వీరవల్లిపాలెం పంచాయతీ కార్యాలయంలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి జరిగింది. సర్పంచ్ సలాది బుచ్చిరాజు ఆధ్వర్యంలో బోస్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి గొల్లపల్లిని కలిసిన గన్నవరపు



శ్రీనివాసరావును సన్మానిస్తున్న గొల్లపల్లి సూర్యారావు



గన్నవరపు శ్రీనివాసరావును సన్మానిస్తున్న పార్టీ నాయకులు

మలికిపురం: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన గన్నవరపు శ్రీనివాసరావు గురువారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావును మర్యాదపూర్వకంగా కలిశారు. మలికిపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తనను కలిసిన శ్రీనివాసరావును గొల్లపల్లి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ, పార్టీని తిరిగి అధికారంలోకి తెచ్చేందుకు జిల్లాలో సమైక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పాటి శివకుమార్, కుసుమ చంద్రశేఖర్, తాడి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

పలువురు నేతల అభినందనలు

అయినవిల్లి: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నియమితులైన జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావును గురువారం నియోజకవర్గంలోని పలువురు పార్టీ ప్రముఖులు అభినందనలు తెలిపారు. ఆయనను ఇంటి వద్ద కలిసి, పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గన్నవరపు మాట్లాడుతూ, పార్టీ విజయం కోసం కలసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు. ఎల్లవేళలా కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు. పార్టీ పి.గన్నవరం మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులు సాధనాల రమేష్, దొమ్మేటి దుర్గారావు, రాజులపాలెం సర్పంచ్ కొమ్ముబత్తుల ఏసు, పాశర్లపూడి సర్పంచ్ కొనుకు నాగరాజు, నాయకులు దొమ్మేటి వెంకట శివరామన్, తోరం భాస్కరరావు, రాయపురెడ్డి కృష్ణ, అడ్డగాళ్ల సాయిరాం, దేశిరాజు సీతారామయ్య, కారుపల్లి శ్రీను, యాండ్ర ఏసు, పుచ్చకాయల నర్సింహమూర్తి, పేరిచర్ల కుమార్‌రాజు, రామరాజు, గుత్తుల మధు, మానుకొండ ప్రసాద్, కుడుపూడి నాగార్జున, చిలకపాటి శ్రీను, కుడుపూడి రాము, పిల్లి సత్యనారాయణ, అప్పన వెంకిబాబు తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్ యువ నేస్తం ఆర్థిక సాయం



నాగశ్రీనుకు ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

మలికిపురం: పశ్చిమ గోదావరి జిల్లా ఆత్తిలి మండలం కంచిమర్రు గ్రామానికి చెందిన గుబ్బల నాగశ్రీను వైద్య ఖర్చుల కోసం రాజోలు కేంద్రంగా పని చేస్తున్న గల్ఫ్ యువ నేస్తం సేవా సమితి సభ్యులు గురువారం ఆర్థికసాయం అందజేశారు. సమితి ద్వారా రూ.20 వేలు, కట్టా శ్రీనివాస్ రూ.వెయ్యి, తుందుర్తి కుమార్‌రాజు రూ.500 మొత్తం రూ.21,500ను అందించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు కండిబోయిన రమేష్, గుబ్బల రామకృష్ణ, కట్టా వాసు, వేండ్ర రమణ, లక్ష్మి, కాండ్రేగుల లక్ష్మీనరసింహమూర్తి, కడలి కష్ణార్జునుడు, దొంగ సత్తిబాబు, కాండ్రేగుల నాగరాజు, కడలి బాలకృష్ణ పాల్గొన్నారు.

బెల్లపు ఊట ధ్వంసం



బొబ్బర్లంకలో బెల్లపు ఊటతో ఎక్సైజ్ పోలీసులు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక గ్రామానికి చెందిన చల్లా వెంకటేశ్వరరావును ఐదు లీటర్ల సారాతో అరెస్టు చేసినట్టు సీఐ కె.కాత్యాయని గురువారం తెలిపారు. కాకినాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ వి.రేణుక ఆదేశాల మేరకు దాడులు నిర్వహించారు. ఆయా దాడుల్లో సారా తయారీకి వినియోగించే 1,900 లీటర్ల బెల్లపు ఊటను బొబ్బర్లంకలో ధ్వంసం చేశారు. దాడుల్లో కాకినాడ, కొత్తపేట ఎక్సైజ్ ఎస్సైలు ఎల్.విజయలక్ష్మి, కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నారు.

వయోజన విద్య మెటీరియల్ పంపిణీ



ఆలమూరులో యానిమేటర్లకు స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ

ఆలమూరు: మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక స్త్రీశక్తి భవనంలో మహిళ విద్యా వలంటీర్లకు ఉల్లాస్ వయోజన విద్య మెటీరియల్ పంపిణీ జరిగింది. మహిళలు కనీస విద్యను అభ్యసించేందుకు వీలుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో రాత్రి వేళల్లో వయోజన విద్యను అభ్యసించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఉల్లాస్‌ను ప్రారంభించింది. అందులో భాగంగా మహిళా విద్యా వలంటీర్లకు తుది విడత శిక్షణ గురువారం పూర్తయింది. ఈ సందర్భంగా ఏపీఎం ఎం.ధనరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ఉల్లాస్ నోడల్ ప్రత్యేకాధికారి విజయభాస్కర్, ఎంపీడీఓ ఎ.రాజు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల్లో విద్యావంతులైన మహిళలు ఆయా గ్రామాల్లో నిరక్ష్యరాసులను గుర్తించి, విద్యను నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే బాధ్యతను యానిమేటర్లు తీసుకోవాలన్నారు. ఒక్కొక్క యానిమేటర్ తమ పరిధిలో ఎంపిక చేసిన విద్యా వలంటీర్‌తో పది మంది మహిళలకు ప్రతి రోజూ సాయంకాలం విద్యను నేర్పించేలా కార్యాచరణ రూపొందించాలని వెలుగు అధికారులను ఆదేశించారు.

దివ్యాంగుల పెన్షన్లపై తనిఖీలు



మోదుకూరులో దివ్యాంగ పెన్షన్‌దారుడికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం దివ్యాంగ పెన్షన్‌దారుల తనిఖీ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ.15 వేలు పొందుతున్న 32 మంది ఇంటికి ప్రత్యేక వైద్య బృందం సందర్శించింది. చొప్పెల్ల, పెదపళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డి.సువర్చలాదేవి, డి.సాయి కిషోర్ నేతృత్వంలో ప్రత్యేక వైద్య బృంద సభ్యులు ఎస్.అశోక్, సీబీవీ సారథి తదితరులు లబ్ధిదారుల వైకల్యాన్ని పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 11 మంది దివ్యాంగులకు గాను 10 మందికి, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 22 మందికి గాను 12 మందికి పరీక్షలు నిర్వహించారు. మిగిలిన వారికి ఈ నెల 27న వికలాంగ పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్య బృందం తెలిపింది.

పాఠశాలకు డ్యూయల్ డెస్కుల వితరణ



దాత అందించిన డెస్కులను స్వీకరిస్తున్న పాఠశాల హెచ్ఎం హరనాథ్

మామిడికుదురు: పెదపట్నంలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం దాత రూ.90 వేల విలువైన డ్యూయల్ డెస్కులను అందించారు. హైదరాబాద్‌కు చెందిన పీపుల్ ప్రైమ్ కంపెనీ అధినేత ఆలేటి రవికుమార్ ఆధ్వర్యంలో పెదపట్నంలంక స్కూలుకు కొల్లా స్వామినాయుడు వీటిని అందించారు. స్కూలు హెచ్ఎం కొండేపూడి హరనాథ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ సుందరనీడి రాజేష్‌కుమార్, ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య దాతను అభినందించారు. పాఠశాల అభివృద్ధిలో దాతల సహాయం మరువరానిదన్నారు. ఎస్ఎంసీ చైర్మన్ ముత్యాల వీరవెంకట సత్యనారాయణ, స్థానిక పెద్దలు పీవీవీ సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

కోనసీమ జిల్లా కబడ్డీ విజేత మామిడికుదురు

మామిడికుదురు: అమలాపురంలో కోనసీమ క్రీడోత్సవం–ఆటలతో ఆరోగ్యం పేరిట నిర్వహిస్తున్న పోటీల్లో జిల్లా కబడ్డీ విజేతగా మామిడికుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలుర జట్టు విజయం సాధించింది. దివంగత జీఎంసీ బాలయోగి స్టేడియంలో గురువారం జరిగిన ఫైనల్ పోరులో ఐ.పోలవరం జట్టును ఓడించింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో విజయం మామిడికుదురు బాలుర జట్టును వరించింది. ఫైనల్స్‌లో విజయం సాధించిన జట్టును ఎంఈఓలు ఎం.లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, హెచ్ఎం సీహెచ్ నిరంజని, పీడీ మట్టా శ్రీధర్, ఎస్ఎంసీ చైర్మన్ వేగి శ్రీనివాసరావు అభినందించారు.



జిల్లా విజేతగా నిలిచిన మామిడికుదురు జట్టు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న ఆర్య వైశ్య సంఘ జిల్లా అధ్యక్షుడు బాబి

రాజోలు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం సహకారంతో కడలి ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు గురువారం ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. యూటీఎఫ్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను సంఘ జిల్లా అధ్యక్షుడు కంచర్ల బాబి విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సంఘ నాయకులు కంచర్ల కృష్ణమోహన్, పోశెట్టి సూరిబాబు, యూటీఎఫ్ అధ్యక్షుడు కె.రాజబాబు, ఎ.దుర్గాప్రసాద్, కేవీఎస్ఎన్ బాబు, బి.రాచయ్య తదితరులు పాల్గొన్నారు.

జీవన ప్రయాణం.. కావాలి సురక్షితం

- బైక్‌పై యువ జంట బ్లైండ్ ఫోల్డ్ ర్యాలీ
- రోడ్డు నియమాలపై వినూత్న ప్రచారం



కళ్లకు గంతలతో బైక్‌పై ర్యాలీ చేస్తున్న మోహిత్, సీత

రావులపాలెం: ఆ యువ జంట వైద్యులే. అంతేగాక ఇంద్రజాలికులు కూడా. త్వరలో జీవితంలో ఒక్కటి కావాలని నిర్ణయించుకున్నారు. జీవన ప్రయాణం ఎలా సాగుతుందో తెలియదు కానీ.. కళ్లకు గంతలతో మోటార్ బైక్‌పై ఎంత భద్రంగా ప్రయాణిస్తామో మాత్రం వారికి కచ్చితంగా తెలుసు. సమాజానికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించేందుకు ఈ జంట కళ్లకు గంతలు కట్టుకుని డ్రైవ్ చేస్తూ అందరినీ అబ్బురపరిచారు. ఈతకోట టోల్ ప్లాజా ఆధ్వర్యంలో 36వ జాతీయ భద్రత మాసోత్సవాల సందర్భంగా గురువారం జరిగిన కార్యక్రమంలో రావులపాలేనికి చెందిన శ్యామ్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ డాక్టర్లు, యువ ఇంద్రజాలికులైన ఫిజియోథెరపిస్టులు మోహిత్, సీత ఈ వినూత్న ప్రచారం చేశారు. ఇద్దరూ బ్లైండ్ ఫోల్డ్ ర్యాలీ నిర్వహించారు. ఈతకోట నుంచి రావులపాలెం పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ కొనసాగింది. ముందుగా ఈతకోట టోల్ ప్లాజా వద్ద ప్రాజెక్ట్ మేనేజర్ కె.బాలసుబ్రహ్మణ్యం, టోల్‌ప్లాజా మేనేజర్ కర్రి వీరవెంకట సత్యనారాయణరెడ్డిలు మోహిత్, సీత కళ్లపై కరాచీ నూక వేసి, కళ్లకు గంతలు కట్టి, శిరస్సుకు హెల్మెట్లు ధరింపజేశారు. అనంతరం వారు టోల్ ప్లాజా నుంచి హైవేపై బైక్ నడుపుతూ, రోడ్డు నియమాలపై నినాదాలు ప్రదర్శిస్తూ రావులపాలెం పోలీస్ స్టేషన్ వరకూ ర్యాలీ చేశారు. సీఐ శేఖర్‌బాబు వారిని అభినందించారు. ప్రముఖ ఇంద్రజాలికుడు శ్యామ్ జాదుగర్ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కలవచర్లలో వృద్ధులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆలమూరు: మండలంలోని కలవచర్ల పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఓఎన్‌జీసీ నేతృత్వంలో న్యూఢిల్లీకి చెందిన అనుగ్రహ దృష్టిదాన్ సంస్థ సహకారంతో రాజమహేంద్రవరానికి చెందిన డివైన్ ఐ–ఫౌండేషన్, పరమహంస యోగానంద కంటి ఆస్పత్రి వైద్యులు సుమారు 320 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. శస్త్రచికిత్సలు అవసరమైన 42 మందిని ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ వడ్డి వెంకన్న, పంచాయతీ కార్యదర్శి వి.వేణి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



తాతారావు మృతదేహం

సఖినేటిపల్లి: గుడిమూల గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన కొల్లాబత్తుల తాతారావు(80) తలకు తీవ్ర గాయమైంది. అతడిని మలికిపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్చగా, చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. ఎస్సై కె.దుర్గా శ్రీనివాసరావు గురువారం తెలిపిన వివరాల మేరకు, గ్రామంలో తాతారావు కాలినడకన వెళుతుండగా, వెనుక నుంచి గుర్తుతెలియని వ్యక్తి మోటార్ బైక్‌తో ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన తాతారావును అతడి కోడలు స్పందన మలికిపురంలోని ప్రైవేట్ ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ తాతారావు చనిపోయాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.